నాడు-నేడుతో మారిన కళాశాల రూపురేఖలు

- రూ. 58 లక్షలతో అభివృద్ధి పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్లోరింగ్, టాయిలెట్ బ్లాక్

ఇది కదా.. అభివృద్ధి

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సంవత్సరాల తరబడి ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండేది. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద కుటుంబాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థులకు మంచి సదుపాయాలను కల్పించాలనే ఉద్దేశంతో నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఎన్నడూలేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కళాశాలలో అభివృద్ధి పనులకు గానూ రూ. 58 లక్షలు మంజూరు చేసింది. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల దశ మారింది. ఎందుకంటే కళాశాల నిర్మించిన 14 సంవత్సరాల కాలంలో కాలేజీ అభివృద్ధికి గత ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. వర్షం వస్తే కారే దయనీయ స్థితిలో ప్రిన్సిపాల్ గదితో పాటు మరో రెండు తరగతి గదులు ఉండేవి. నాడు-నేడుతో పాత శ్లాబు తొలగించి కొత్తగా శ్లాబు వేశారు. అనేక గదుల గోడలు పగిలిపోయి కనిపించేవి. కిర్రుమంటూ శబ్దం చేస్తూ తిరగలేక తిరిగే ఫ్యాన్లు నేడు గాలినిస్తూ చక్కగా తిరుగుతున్నాయి. విద్యార్థులకు సరైన టాయిలెట్స్ సదుపాయం లేక అవస్థలు పడేవారు. నేడు ప్రత్యేకంగా నిర్మించిన టాయిలెట్ బ్లాక్ ఎంతో ప్రయోజనకరంగా ఉందని విద్యార్థినులు అంటున్నారు. దివ్యాంగులైన విద్యార్థులకు ప్రత్యేకంగా రెయిలింగ్ నిర్మించడంతో వారు దాన్ని సద్వినియోగం చేసుకొంటున్నారు. ప్రహరీగోడ మరమ్మతులు చేశారు. మేజర్, మైనర్ రిపేర్ల కింద అన్ని మరమ్మతులు జరగడంతో కళాశాల సిబ్బందితో పాటు విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది



ప్రభుత్వ కళాశాల అంటే ఒకప్పుడు ఎంతో చులకనగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనస్సుతో నాడు–నేడు ద్వారా కళాశాలలో చదువుతున్న ఆడపిల్లలు ఇబ్బంది పడకుండా ప్రత్యేకంగా టాయిలెట్స్ నిర్మించారు. మా పిల్లలకు మంచి సదుపాయాలు కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది.

– కె.అశోక్, అజిత్‌సింగ్‌నగర్

ప్రభుత్వ కళాశాలలో సదుపాయాలు బాగున్నాయి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కళాశాలల్లో సదుపాయాలు బాగున్నాయి. గతంలో ఏ ప్రభుత్వమూ కళాశాలలో సదుపాయాల గురించి పట్టించుకోలేదు. పేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సదుపాయాలను ప్రభుత్వం కల్పించడం అభినందనీయం.

– జి.రత్తయ్య, అజిత్‌సింగ్‌నగర్

ఎమ్మెల్యే వెలంపల్లికి పరామర్శ


ఎమ్మెల్యే వెలంపల్లిని పరామర్శిస్తున్న మహేష్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): సింగ్‌నగర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుపై జరిగిన దాడిలో కంటికి తీవ్ర గాయమైన వెలంపల్లిని సోమవారం పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. బ్రాహ్మణ వీధిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలిమెట్ల శరత్‌బాబు, కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ, వాస బాబు, తంగెళ్ల రాము తదితరులు ఉన్నారు.

పస్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇటీవల విజయవాడలో జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రలో గాయపడిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ పరామర్శించారు. పోతిన మహేష్ సోమవారం వెలంపల్లి శ్రీనివాసరావు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. గాయం వివరాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని పేర్కొన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జల్లి రమేష్, బొట్టా సాయికుమార్, నెమలి సంజీవరావు, సుభాని భాను, సోమి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ముస్తాబవుతున్న రామాలయాలు


దేవీనగర్‌లో సీతారాముల కల్యాణోత్సవానికి సిద్ధం చేసిన సెట్టింగ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీరామ నవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబవుతున్నాయి. మధురానగర్ మెయిన్ రోడ్డులోని శ్రీకల్యాణ రామాలయం, దేవీనగర్‌లోని కోదండ రామాలయం, ముత్యాలంపాడులోని కోదండ రామాలయం, రామలింగేశ్వరపేటలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, మాచవరంలోని శ్రీ దాసాంజనేయ స్వామివారి దేవాలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లను వేసి సీతారాముల కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

ముగిసిన తెలుగు పరిచయం కోర్సు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాతృభాషతో పాటు ఇతర భాషలు నేర్చుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి సూచించారు. కళాశాలలో సోమవారం తెలుగు పరిచయం కోర్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె కోర్సు పూర్తిచేసిన ఏజీ కార్యాలయ సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పలు రాష్ట్రాలకు చెందిన వారికి ఇక్కడ తెలుగు భాషను బోధించడం ఆనందంగా ఉందని అన్నారు. ఏజీ కార్యాలయ అసిస్టెంట్ ఆడిటర్ వెంకటేష్, డ్రీ ఆడిట్ అకౌంటెంట్ జనరల్ పీ ఎలీషాపాల్ మాట్లాడుతూ కేవలం 48 రోజుల్లోనే తెలుగు నేర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ కేవీ శాంతకుమారి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంజీ రోడ్డులో బొంబే జ్యూయలర్స్ షోరూమ్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీ రోడ్డులో బెంజిసర్కిల్ సమీపంలోని సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బొంబే జ్యూయలర్స్ షోరూమ్‌ను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. షోరూమ్‌లో పలు డిజైన్లలో గోల్డ్, డైమండ్, ప్లాటినం బంగారు ఆభరణాలు అందించనున్నట్లు నిర్వాహకులు ముఖేష్‌కుమార్ జైన్, మనీష్‌కుమార్ జైన్‌లు తెలిపారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): తీవ్రమైన ఎండలకు బాటసారులు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు పాయకాపురం శాంతినగర్‌లోని శారదా స్కూల్ నందు పెనుమత్స తాతారావు జ్ఞాపకార్థం స్కూల్ కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. బాటసారులు అవసరమైతే తప్ప బైటకు రాకూడదని, వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అప్పలరాజు అన్నారు. సేవాసంఘాలను కలుపుకొని మరికొన్ని మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శారదా స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా పాలనకు ఆద్యుడు శ్రీరాముడు



విజయవాడ కల్చరల్: ప్రజా సంక్షేమ పాలనకు ఆద్యుడు శ్రీ రామచంద్రమూర్తి అని ఆధ్యాత్మిక వేత్త మురదూరి నరసింహాచార్యులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన శ్రీరామ నవమి సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నరసింహాచార్యులు శ్రీరామరాజ్యం అంశంగా ప్రసంగించారు. శ్రీరాముడు దుష్టులను శిక్షించడం, హితులను రక్షించడం, ప్రజలకు రక్షణ కల్పించడం చేశారని తెలిపారు. రాజ్యంలోని ప్రజలు ఏమనుకుంటున్నారో వేగుల ద్వారా విచారించేవాడని పేర్కొన్నారు. రామరాజ్యం సంక్షేమం దిశగా సాగిందని వివరించారు.

పరాశక్తి లీలలు.. అనంతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పరాశక్తి అయిన అమ్మవారి లీలలు అనంతమైనవని హరికథ కథనంలో గుంటూరుకు చెందిన డాక్టర్ సింహాచల శాస్త్రి వర్ణించారు. వసంత నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గుంటూరుకు చెందిన సింహాచల శాస్త్రి బృందం పరాశక్తి లీలలను హరికథగా వివరించారు. అనంతరం ఆలయ ఈఓ కె.ఎస్. రామారావు సింహాచల శాస్త్రి బృందానికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 'భవన నిర్మాణంలో అగ్ని రక్షణ పదార్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, అయస్కాంత సెన్సార్లలో నానో సాంకేతికత'పై అంతర్జాతీయ వెబినార్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో దక్షిణ కొరియా, డొంగువాన్ జాతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ చీదరాల రవికుమార్, గౌహతి ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.పాము, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కొల్లు ప్రతాప్ ప్రసంగించారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ కళాశాల విద్య కమిషనరేట్ ప్రభుత్వ కళాశాలలో ప్రయోగాలకు ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగా వెబినార్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి నానో సాంకేతికత ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ప్రపంచంలోని సుమారు రెండు వందల మంది అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదులు వృత్తిని దైవంగా భావించాలి


బార్ అసోసియేషన్ సభ్యులకు అభినందన సత్కారం నిర్వహిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

విజయవాడకల్చరల్: న్యాయవాదులు తమ వృత్తిని దైవంగా భావించాలని అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, తెలుగు కళావాహిని, క్యామెడ్ జీఆర్‌కే, పోలవరపు కోటేశ్వరరావు సాహితీసమితి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద 2024–25 సంవత్సరంలో బెజవాడ బార్ అసోసియేషన్‌కు ఎన్నికైన కమిటీ సభ్యులకు సోమవారం అభినందన సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ బెజవాడ బార్ అసోసియేషన్ ప్రజల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, కార్యదర్శి ఆరిగల శివప్రసాద్, ఉపాధ్యక్షుడు గండూరి వెంకటరామశర్మ, గ్రంథాలయ కార్యదర్శి చావలి రవికుమార్, మహిళా కార్యదర్శి సిద్ధాబత్తిన రాజ్యలక్ష్మిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్ రాజు, శారదా కళాసమితి వ్యవస్థాపకుడు డోగిపర్తి శంకరరావు, బోడి అంజనేయరాజు, ప్రసూనారామన్ పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయకులు చిత్ర గీతాలను ఆలపించారు.

హజరత్తయ్య గుప్తా బహుముఖ ప్రజ్ఞాశాలి


గుప్తాను సత్కరిస్తున్న క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్

పాయకాపురం(విజయవాడరూరల్): హజరత్తయ్య గుప్తా అన్ని రంగాల్లో విజ్ఞానం కల్గిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్ అన్నారు. అంతర్జాతీయ వాసవీ క్లబ్ లీగల్ ఛైర్మన్‌గా క్లబ్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తాను ఆ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్రన్ నియమించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాజీవ్‌నగర్‌లోని వాసవీ భవన్‌లో క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్, మాజీ గవర్నర్లు, క్లబ్ ప్రతినిధులు గుప్తాను సత్కరించారు. క్లబ్ జిల్లా గవర్నర్ గణేష్ మాట్లాడుతూ 2019లో క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు స్వయం ఉపాధికి సృష్టించిన శ్రేయోభిలాషి పథకం జన బాహుల్యానికి ఉపయోగకరంగా ఉందన్నారు. అంతేకాక సరస్వతి పథకం, గోసేవ సంస్థలకు ఆయన ఛైర్మన్‌గా ఉన్నారని తెలిపారు. గుప్తా మాట్లాడుతూ వాసవీ క్లబ్‌ల అంతర్జాతీయ లీగల్ ఛైర్మన్‌గా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

27 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ (ఎస్ఏపీ ఎస్‌డీ) కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 22 ఏళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులకు విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 14 వారాల కాలపరిమితి గల శిక్షణలో శని, ఆదివారాల్లో మూడు గంటల పాటు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 70935 29750 ఫోన్ నంబరులో సంప్రదించాలని సురేష్ కోరారు.

నలందలో పెయింటింగ్ కాంపిటీషన్స్


విజేతలతో ప్రిన్సిపాల్ మాదల పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): వరల్డ్ ఆర్ట్ డే పురస్కరించుకుని గాయత్రీనగర్‌లోని నలంద విద్యానికేతన్‌లో సోమవారం ఇంటర్ స్కూల్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పెయింటింగ్స్, శిల్పాలు వివిధ ఫొటోలతో కూడిన చిత్ర ప్రదర్శనలను నిర్వహించారు. ఇంటర్ స్కూల్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్‌లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను 3వ తరగతి నుంచి 12 వ తరగతి వరకూ మూడు గ్రూపులుగా నిర్వహించారు. గ్రూప్–ఎలో 3 నుంచి 5వ తరగతి వరకూ, గ్రూప్– బిలో 6 నుంచి 8, గ్రూప్–సి 9 నుంచి 12 తరగతి వరకూ విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్–ఎ లో కనక్ కరీర, ఐ.గీతాశ్రీ, కె.నిషిత్ విజేతలుగా నిలవగా, బి హిమిత, డి.శ్రీహిత కన్సోలేషన్‌కు ఎంపికయ్యారు. గ్రూప్–బి లో ఎంఎల్ శ్రేష్ఠ, కె.వేద సంహిత, డి.శ్రీదుర్గా నిత్య, బిజలేఖనంది నిలు విజేతలుగా నిలవగా, పి.దేవశ్రీ, ఎస్.నిహార్, అర్నా బన్నలు కన్సోలేషన్‌లు అందుకున్నారు. గ్రూప్ సి నుంచి కె.శ్రీనిధి, ఎస్ సంహిత, జి.ఈషాపుష్ప, ద్రిధి కఠారియాలు విజేతలుగా నిలవగా, ఎస్ఎస్ఎస్ వశిష్ట, ఎన్.జశ్వంత్, గ్రీష్మ లక్ష్మి కన్సోలేషన్ గెలుపొందారు. ఈ సందర్భంగా విజేతలకు నలంద ప్రిన్సిపాల్ మాదల పద్మజ బహుమతులు అందజేశారు.

సీఎం జగన్‌పై దాడి సిగ్గుచేటు


61వ డివిజన్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ రమాదేవి, కార్యకర్తలు


సత్యనారాయణపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ శర్వాణీమూర్తి


32వ డివిజన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యురాలు సుభాషిణి తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం సిగ్గుచేటని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ స్థానిక 57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేట, 60వ డివిజన్ వాంబేకాలనీ ప్రాంతాల్లో సోమవారం నిరసన కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ నాయకులు చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం జగన్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు త్వరగా కోలుకోవాలని కోరుతూ ఆయా డివిజన్లలోని అమ్మవారు, అంజనేయస్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, 60వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బెవర నారాయణ, నాయకులు ఇసరపు రాజు, కాళ్ల ఆదినారాయణ, బాల, పఠాన్ నజీర్‌ఖాన్, ఉత్తమ్, బత్తుల దుర్గారావు, ఫాతిమా, మూర్తి, అన్నపురెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై దాడిని ఖండిస్తూ నిరసనలు..

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులపై దాడి చేయడాన్ని ఖండిస్తూ సోమవారం వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. 61వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి పార్టీ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్, డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, కన్వీనర్ నాలం బాబు, ఆర్ఎస్ నాయుడు, నాగిరెడ్డి పాల్గొన్నారు. 62వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి అలంపూరు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, మహిళా విభాగం జిల్లా జాయింట్ సెక్రటరీ హైమావతి, షేక్ మస్తాన్, డివిజన్ కోఆర్డినేటర్ వీరబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు. 63వ డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి శ్రీనివాసరావు, గణేష్, రవి పాల్గొన్నారు. 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ, నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి దాడిని ఖండించారు. డివిజన్ కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, కే నాని, మహేష్, శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేయడాన్ని ఖండిస్తూ సోమవారం రాత్రి రాజీవ్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేశారు. రాజీవ్‌నగర్ నుంచి వడ్డెరబజారు, రంగా విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. 63వ డివిజన్ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ వసుపులేటి యేసు, గణేష్, సీహెచ్ రవి, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, శ్రీనివాసరావు, నాగుయాదవ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన దాడిని ఖండిస్తూ 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం డివిజన్ పార్టీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. డివిజన్ కోఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్, నాయకులు రామకృష్ణ, రంగబాబు, ఎస్ శ్రీనివాస్, కే రత్నకుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి సీఎం జగన్‌పై దాడిని ఖండించారు. కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఏమైనా రాజకీయాలు ఉంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని ఇటువంటి నీచరాజకీయాలు తగవని అన్నారు. పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జి కంభం కొండలరావు, రమేష్, నాగమణి, పూర్ణిమ, సంపత్, గోవిందు, శ్యాంసన్ పాల్గొన్నారు. 27,30,31 డివిజన్‌లలో ఆయా డివిజన్ కార్పొరేటర్లు కొండాయగుంట మల్లీశ్వరి, బీ జానారెడ్డి, పెనుమత్స శిరీష, 32వ డివిజన్‌లో నగరపాలకసంస్థ కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి సీఎం జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. కార్యక్రమాల్లో ఆయా డివిజన్ల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిని ఖండిస్తూ డిప్యూటీ మేయర్ శైలజ అజిత్‌సింగ్‌నగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. చంద్రబాబు, బొండా ఉమా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. డిప్యూటీ మేయర్ శైలజ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం జగన్‌పై రాళ్లతో దాడి చేయాలని గతంలో పలుమార్లు మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ మేరకే పక్కా ప్లాన్‌తో ఈ దాడి జరిగిందా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. సీఎంపై హత్యాయత్నం జరిగితే టీడీపీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో దారుణమైన వీడియోలు పెట్టి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సెంట్రల్ నియోజకవర్గంలో భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు


యనమలకుదురులో శ్రీరామలింగేశ్వరస్వామి

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఏక రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివార్లకు విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, ఉదయం 9.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం చేస్తామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

శివకామేశ్వరి అమ్మవారికి తులసి దళాలతో అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సోమవారం అమ్మవారికి తులసి, మారేడు దళాలతో అర్చన నిర్వహించారు. వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నందున మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాంబేకాలనీ, దేవినేని గాంధీపురం, పైపులరోడ్డు, వైఎస్సార్ పార్క్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ఉదయం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ముత్యాలంపాడు పురవీధుల్లో షిర్డీలో మాదిరిగా చందనోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు సీతారాముల కల్యాణం, చందనోత్సవంలో పాల్గొని సీతారాములు, బాబావారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.